అన్ని రకాల సెలవులు రద్దు

- వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో నేపథ్యంలో వైద్యారోగ్యశాఖలో ఉద్యోగులు, సిబ్బందికి అన్ని రకాల సెలవులను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి శ్రీనివాసరావు జిల్లా వైద్యారోగ్య అధికారులను ఆదేశించారు. ఉద్యోగులందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదేశాలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరీక్ష తర్వాత సవరణలు

- ఎంహెచ్ఎస్ఆర్‌బి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగస్టు నెలలో నిర్వహించనున్న స్టాఫ్ నర్సు పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల వివరాల్లో ఏవైనా సవరణలుంటే పరీక్షల అనంతరం చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్టు రాష్ట్ర వైద్యసేవల నియామక మండలి తెలిపింది. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ, సవరణలకు అవకాశమిచ్చామని తెలిపింది. అయినా హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తర్వాతా సవరణల కోసం అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తుండటంతో బోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకుందని తెలిపింది. పుట్టిన తేదీ, ఇంటిపేరు తదితర తప్పులతో పాటు సాంకేతిక లోపం కారణంగానూ తమ హాల్ టికెట్లలో తప్పులొచ్చాయని అభ్యర్థులు వాపోతున్నారు. అయితే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరీక్ష అనంతరం సవరించుకోవచ్చని మండలి సూచించింది. హాల్ టికెట్ల డౌన్‌లోడ్, ప్రింట్ తీసుకోవడంలో ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 74169 23578 నెంబర్‌లో గానీ helpdeskstaffnurse2023@gmail.com లో గానీ సంప్రదించవచ్చు.

ఉమ్మడి వరంగల్‌లో వరద కన్నీరు

- మేడారంలో భారీగా వరద
- ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను రక్షించిన ఎన్‌డిఆర్ఎస్ బృందాలు
- కాజీపేట రైల్వే స్టేషన్‌లోకి భారీగా నీరు, పలు రైళ్లు రద్దు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. వరంగల్, హన్మకొండలోని కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. చెరువులు, వాగులు, కుంటలు ఉప్పొంగడంతో గ్రామాల్లోకి భారీగా నీరు చేరుతోంది. వాగుల్లో చిక్కుకున్న వారిని ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరంగల్ జిల్లా వరంగల్-ఖమ్మం రహదారిపై, నాయుడు పంపు జంక్షన్ వద్ద భారీ వృక్షం విరిగి రహదారిపై పడింది. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారి గుండా రాకపోకలు స్తంభించిపోయాయి. చిన్నగూడూరు మండలంలో గంగమ్మ ఆలయం పూర్తిగా మునిగిపోయింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం జంపన్న వాగు ఉగ్రరూపం దాల్చడంతో పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. మేడారం గద్దెల వరకు వరద నీరు చేరుకుంది. లింగాల స్తూపం నుంచి బోటిలింగాల మీదుగా గుండాలకు వేసిన డబుల్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జరిగే ప్రాంతంలో ప్రజలు ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాలు మొత్తం నీట మునిగాయి.

వరంగల్, భూపాలపల్లి, హన్మకొండ, ములుగు జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. భూపాలపల్లి జిల్లాలోని మోరంచవాగు సుమారు 15 అడుగుల ఎత్తులో ఉధృతంగా ప్రవహించడంతో మోరంచపల్లి గ్రామం జలదిగ్బంధమైంది. దాంతో స్పందించిన సొఎం.. హెలికాప్టర్ల ద్వారా వారిని రక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా రెండు హెలికాప్టర్ల ద్వారా గ్రామస్తులను సురక్షితంగా వరంగల్‌కు చేర్చారు. వరంగల్ నగరంలో అనేక కాలనీలు వరద గుప్పిట్లో ఉన్నాయి. భగత్ సింగ్ నగర్‌లో వరద పోటెత్తడంతో నీటిలో చిక్కుకున్న వారిని అగ్నిమాపక శాఖ అధికారులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. జంపన్నవాగు ప్రాంతంలో జలదిగ్బంధంలో చిక్కుకున్న వారిని ఎన్‌డిఆర్ఎస్(రెస్క్యూ టీం) బృందాలు 16 మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొన్ని చోట్ల పడవల ద్వారా అధికారులు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. హన్మకొండ జిల్లా నయీమ్ నగర్ పెద్దమోరీ వరదల్లో కార్లు, ఆటోలు, బీరవాలు కొట్టుకుపోయాయి. శాయంపేట మండలంలో 24 గ్రామాలు పూర్తిగా జలమయమయ్యాయి. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ముత్యందార జలపాతం సందర్శన కోసం వెళ్లిన 80 మందిని రెస్క్యూ అధికారులు కాపాడారు.

వరదలో చిక్కుకున్న ఆర్‌టిసి బస్సు

ములుగు జిల్లా జంపన్న సమీపంలో చిరు వ్యాపారులు ఎనిమిది మంది వరదలో చిక్కుకోవడంతో రిస్కీ టీం బృందాలు సహాయ చర్యలు చేపట్టాయి జాకారం సమీపంలోని పనేసా మోరి వద్ద హైదరాబాద్ నుంచి మంగపేట 36 మందితో వెళ్తున్న సూపర్ లగ్జరీ ఆర్‌టిసి బస్సు వరదల్లో చిక్కుకోగా పోలీసులు రక్షించారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

ఏటూర్‌నాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద గురువారం సాయంత్రం నాటికి 14 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. ఇదే తీరుగా వరద పెరిగి 14 .830 మీటర్లకు చేరితే అధికారులు మొదటి హెచ్చరికను జారీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కొండాయి వద్ద సమీపిస్తున్న జంపన్న వాగు వరద ఉధృతికి కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లోకి వరదనీరు భారీగా చేరడంతో ఆ ప్రాంత ప్రజలన పునరావాస కేంద్రానికి తరలించారు.

నీట మునిగిన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు

మంగపేట మండల కేంద్రంలో వరదలకు పలు ప్రభుత్వ కార్యాలయాలు నీట మునగగా రైతువేదిక నీట మునిగింది. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో కస్తూర్బా బాలిక పాఠశాల నీటమునిగింది. దాంతో విద్యార్థులను ట్రాక్టర్లలో మోడల్ స్కూల్‌కు తరలించారు. మంగపేట మండలంలోని గౌరారం వాగు ఉప్పొంగడంతో సమీపంలోని మిరప నారుమల్లు మునిగిపోయాయి.

వరదల్లో గల్లంతై..

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలో బంధువుల దశదినకర్మకు వెళ్లి వస్తూ వరదలో చిక్కుకొని ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు పిండి యాకయ్య (40), పిండి శ్రీను (35) మృతిచెందారు. హన్మకొండ జిల్లా వేలేరు మండల కన్నారం గ్రామ వాగులో గ్రామానికి చెందిన పొన్నాల మహేందర్ (32) బైక్‌తో సహ కొట్టుకుపోయి మృతిచెందారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మండల సరిహద్దు గ్రామమైన ప్రాజెక్ట్‌నగర్ గ్రామంలో ఆటో డ్రైవర్ రహీం భార్య, ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం బంధాల ఎర్ర చెరువు వరద ఉధృతికి తెగి పోవడంతో.. ఆదివాసీ రైతులకు చెందిన 20 దుక్కిటెద్దులు కొట్టుకుపోగా.. 17 పశువులు మృతదేహాలు లభించాయి. మరో మూడు గల్లంతయ్యాయి.

నీట మునిగిన కాజీపేట రైల్వే స్టేషన్

వానల నేపథ్యంలో కాజీపేట్ రైల్వేస్టేషన్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. రైల్వే పట్టాలపై నీరు చేరడంతో ప్రయాణికులకు ఆటంకం ఏర్పడింది. దాంతో, హసన్‌పర్తి-కాజీపేట రైట్‌లో మూడు రైళ్లను పూర్తిగా, నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 9 రైళ్లను దారి మళ్లించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

ప్రమాదకర స్థితిలో 'కడెం'

- పోటెత్తిన వరద ప్రవాహం
- మొరాయించిన గేట్లను జెసిబితో ఎత్తిన అధికారులు
- ముంపు గ్రామాల ప్రజల తరలింపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కడెం ప్రాజెక్టుకు వరద ప్రవాహం పోటెత్తడం.. డ్యాం పైనుంచి వరద ప్రవహించడం ప్రమాదకర పరిస్థితిని తలపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏం జరుగుతుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంది. ఊళ్లను ముంచెత్తి అవకాశం ఉండటంతో పలు గ్రామాల ప్రజలను అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. బుధవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి నీటి ప్రవాహం కడెం ప్రాజెక్టుకు తీవ్రస్థాయిలో చేరింది. గురువారం 3.80 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి రాగా..2.42 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. ఇన్‌ఫ్లో భారీ స్థాయిలో ఉండటం.. అవుట్ ఫ్లో మాత్రం తక్కువగా ఉండటంతో వరద నీరు ప్రాజెక్టు పై నుంచి ఉరకలెత్తింది. నాలుగు గేట్లు తెరుచుకోకపోవడం.. ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో ఉందని ప్రచారం జరగడంతో రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. మరోపక్క ప్రాజెక్టు ఎడమ కెనాల్ వద్ద గండి పడటంతో వరద నీరు ఉప్పొంగి ప్రవహించింది. అయితే, రాత్రికి ప్రాజెక్టులోకి వరద కొంతమేర తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కడెం ప్రాజెక్టుకు 18 గేట్లు ఉండగా ఇందులో 14 గేట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా నాలుగు గేట్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కిందటేడాది పరిస్థితి పునరావృతమైంది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రాజెక్టు వద్ద పరిస్థితిని సమీక్షించారు. సందర్శనకు వచ్చిన ప్రజాప్రతినిధుల వద్ద స్థానిక రైతులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తీరు కారణంగానే ప్రాజెక్టుకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందటేడాది నుంచి ఇప్పటి వరకు గేట్లకు మరమ్మతులు చేపట్టకపోవడం కారణంగానే వరద ప్రవాహం ముంచెత్తుతోందని మండిపడ్డారు.

సురక్షిత ప్రాంతాలకు ప్రజలు

కడెం ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో ముందు జాగ్రత్తగా పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దేవునిగూడ, భూత్నూర్, రాంపూర్, మున్యాల్, డ్యాంగూడెం, కన్నాపూర్, పాండ్వాపూర్ లంబాడితాండ, అంబరిపేట్ తదితర గ్రామాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అప్పటికే కొన్ని గ్రామాల సరిహద్దుల వరకు వరద నీరు చేరడంతో జనాలు భయంభయంగా గడిపారు. పాండ్వాపూర్ వద్ద బ్రిడ్జికి ఆనుకొని వరద నీరు ప్రవహిస్తుండటంతో నిర్మల్-మంచిర్యాల మధ్య రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ప్రాజెక్టు పరిస్థితి దృష్ట్యా దిగువ ప్రాంతాల గ్రామాలు, ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పోలీసులు అటువైపు ఎవరూ వెళ్లకుండా బందోబస్తు నిర్వహించారు.

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

- పార్టీ శ్రేణులకు సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సహాయ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని పార్టీ శ్రేణులను సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు, వరదల వల్ల వేలాది ఎకరాల్లో పత్తి, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు తదితర పంటలు నీటిలో మునిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల ప్రాణనష్టంతోపాటు, మూగ జీవాలు చనిపోయాయని వివరించారు. లోతట్టు కాలనీల ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయంతో ప్రజలు వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని తెలిపారు. వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, హైదరాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. ఇంకా అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని గుర్తు చేశారు. వరద ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలు, శ్రేణులకు ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదలశాఖ అప్రమత్తం - రజత్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ అప్రమత్తంగా ఉందని ఆ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. కడెం ప్రాజెక్టులో రెండు గేట్లు మొరాయించాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేసి పునరుద్ధరించినట్టు చెప్పారు. డ్యామ్ ఎత్తు 700 అడుగులు కాగా, 702 అడుగుల మేర నీటి ప్రవాహం ఉందని అన్నారు. గతేడాది 706 అడుగుల మేర నీరు ప్రవహించిందని, ఎలాంటి ఇబ్బంది జరగలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు.

మిషన్ కాకతీయ ఫలితాలు కనిపిస్తున్నయ్..

బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గురువారం ఎనిమిది గంటల వరకు ములుగులో అత్యధికంగా 650 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంత పెద్ద మొత్తంలో వర్షాపాతం నమోదవడం ఇదే తొలిసారని రజత్‌కుమార్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్‌లో అత్యధిక వర్షపాతం నమోదైందనీ, నీటిపారుదల శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తోందని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయనీ, మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల పూడికతీతతో ఇంత భారీ వర్షాలు, వరదలతో పెద్దగా గండ్లు పడడం లేదన్నారు. ఇంత పెద్ద ఎత్తున వరదలు వచ్చిన కేవలం 100లోపు చెరువులు మాత్రమే గండ్లు పడ్డాయని తెలిపారు. గోదావరి నదిలో వరద ఎక్కువగా ఉందనీ, జిల్లా కేంద్రాల్లో నీటిపారుదల శాఖ ప్రత్యేకంగా ఇంజినీర్లను నియమించినట్టు వివరించారు. కడెంలో వరద ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. రాబోయే కొద్దిగంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్యామ్‌లపైకి వెళ్లి సెల్ఫీ తీసుకోవద్దని సూచించారు.

భద్రాచలం వద్ద ఉధతంగా గోదావరి

భద్రాచలం దగ్గర గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నదని రజత్‌కుమార్ తెలిపారు. అక్కడ సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల్లోని నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచామన్నారు. సైనికులను అక్కడ అందుబాటులో ఉంచుతామనీ, సాయంత్రం భద్రాచలానికి రెండు హెలికాప్టర్లు పంపున్నట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు గేట్లు ఎప్పుడు ఎత్తి ఉంచాలని చెప్పామనీ, గోదావరి నదిలో వరద ప్రవాహం తగ్గే అవకాశాలున్నాయని వివరించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వనమాకు హైకోర్టులో చుక్కెదురు

మధ్యంతర పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వనమా వెంకటేశ్వరరావుకు తెలంగాణ హైకోర్టులో మళ్లీ చుక్కెదురైంది. ఎమ్మెల్యేగా ఆయన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పును నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ మేరకు వనమా దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఈ నెల 25న తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.

తప్పుడు వివరాలతో వాస్తవాలను దాచి ఎన్నికల అఫిడవిట్ సమర్పించినందుకు ఆయనకు రూ.ఐదు లక్షల జరిమానా విధించింది. దీంతోపాటు పిటిషనర్ జలగం వెంకట్రావు కోర్టు ఖర్చులనూ చెల్లించాలని ఆదేశించింది. జలగం వెంకట్రావు 2018 డిసెంబరు 12 నుంచి కొత్తగూడెం ఎమ్మెల్యేగా కొనసాగుతారని ప్రకటించింది. 2018 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచిన వనమా వెంకటేశ్వరరావు (అనంతర కాలంలో ఆయన భారాసలో చేరారు) ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ తరఫున పోటీ చేసిన జలగం వెంకట్రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జి రాధారాణి సుదీర్ఘ విచారణ చేపట్టి మంగళవారం 84 పేజీల తీర్పును వెలువరించారు.

అయితే, ఈ తీర్పుపై స్టే ఇవ్వాలని బుధవారం వనమా వెంకటేశ్వరావు లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు తనకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు అత్యవసర పిటిషన్‌పై నిన్న వాదనలు విన్న న్యాయస్థానం.. తీర్పును రిజర్వు చేసింది. తాజాగా ఆ తీర్పును నిలిపివేసేందుకు నిరాకరిస్తూ వనమా పిటిషన్‌ను గురువారం కోర్టు కొట్టివేసింది.

జోరువానలోనూ బతుకు పోరు

- కలెక్టరేట్ల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా
- భారీ వర్షంలోనే నిరసన
- మనోవేదనతో కార్మికుడు మృతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యల పరిష్కారం కోసం 22 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేశారు. జోరు వానలోనూ గురువారం కలెక్టరేట్లను ముట్టడించారు. వర్షంలోనే కూర్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా తమ గోడు వినకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.మహిపాల్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీరికి కెవిపిఎస్, గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కలెక్టర్ నారాయణకు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులుగా జిపి కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారిని అధికారులు బెదిరించడం సరికాదన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు అన్ని మండలాల నుంచి కార్మికులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. డిపిఒ శ్రీనివాస్‌రెడ్డి బయటకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు.

సంఘాల జెఎసి ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మొదట మున్సిపల్ ఆఫీసు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. వర్షం కురుస్తున్నా గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి ఎర్రజెండా చేతపట్టి కదం తొక్కారు. ధర్నా నేపథ్యంలో కార్యాలయ గేట్లను మూసేయడంతో వానలోనే కార్మికులు ధర్నా చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జెఎసి నాయకత్వంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌ను ముట్టడించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. యాదాద్రి భువన గిరి, నల్లగొండ కలెక్టరేట్లను వేలాది మంది కార్మికులు ముట్టడించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు, కొప్పర్లు పట్టుకుని ధర్నాలో పాల్గొన్నారు.

మనోవేధనతో కార్మికుడు మృతి

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పంప్ ఆపరేటర్ బయ్య కృష్ణ (45) మృతి చెందారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కృష్ణ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నాలుగు రోజులుగా వర్షంలో తడుస్తూనే సమ్మెలో కూర్చున్నారు. తమ హక్కులను సాధించుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని కుటుంబీకులతో చెబుతూ ఉండేవారు. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కృష్ణ మృతిచెందారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం ఆలోచించి మరో కార్మికుడు బలి అవ్వకముందే గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు కనీస స్థాయికి పెంచి, వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సిఎం ఎసిఆర్‌కు ఆయన లేఖ రాశారు. గ్రామ పంచాయతీ కార్మికులు 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. వారికి నెలకు రూ.8,500 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. పారిశుధ్య కార్మికులకు రూ.16,500, ఆ పైన పని చేసే వారికి రూ. 19,000లు, మాత్రమే వేతనాలుగా చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ వేతనాలను అమలు చేసినా వారికి సంవత్సరానికి వచ్చేది రూ.1,98,000 మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,17,000లుగా ఉన్నదంటూ అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వ పెద్దలు అనేక పర్యాయాలు ప్రస్తావించారని గుర్తు చేశారు. గ్రామ పంచాయితీ కార్మికుల కుటుంబాల్లో కనీసం నలుగురు సభ్యులుంటారని తెలిపారు. ఆ లెక్కన తలసరి ఆదాయం ప్రకారం ఆ కుటుంబం వాటా రూ.12,68,000లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కుటుంబ ఆదాయం తెలంగాణ తలసరి ఆదాయం (రూ.3,17,000) సమానంగా అయినా ఉండాలి కదా? పేర్కొన్నారు. అయినప్పటికీ వారు ఏడాదికి రెండు లక్షలు ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారని గుర్తుచేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలను పెంచి వారి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు.



నవ్వులు పూయించిన స్వప్న వసంతం నాటకం

ప్రజాశక్తి కల్చరల్

ప్రఖ్యాత ఆంగ్ల నాటక కర్త విలియం షేక్స్పియర్ నాటకాలు అధికాభాగం విషాదంతాలే. కానీ ఆయన రచించిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ నాటకం ఆద్యంతం హాస్యభరితం.. ఈ నాటకాన్ని స్వప్న వసంతం పేరిట రాజీవ్ వెలిచేటి తెలుగులోకి అనువదించారు. టిక్కెట్‌పై నాటక ప్రదర్శన తెలుగు నాటకాన్ని ఉజ్జీవింప ఉద్యమంగా చేపట్టిన రసరంజని సంస్థ నిర్వహణలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై గురువారం హైదరాబాద్ వారి దీ స్టూడియో సమర్పణలో స్వప్న వసంతం నాటకాన్ని జాన్ బషీర్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ఒక యువ రాజు వివాహ సందర్భంగా రెండు బృందాల మధ్య జరిగే కలహాలుతో పాటు వివాహ రోజు వేయబోయే నాటక బృందం సృష్టించే గడ బిడా వెరసి నవ్వులను పూయిస్తాయి. నాటకం ప్రాంతీయ వాతావరణ నేపథ్యంలో సాగింది. నటులంతా యువత కావటంవల్ల ఆసాంతం నాటకాన్ని రక్తి కట్టించారు.

ఆర్‌జిఐ ఎయిర్‌పోర్ట్‌లో మిల్లెట్ రెస్టారెంట్ ఏర్పాటు



హైదరాబాద్ : ఐసిఎఆర్–ఐఐఎమ్ఆర్‌లో అంకుర సంస్థ అయిన మిల్లెట్ మార్వెల్స్, జిఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐసిఎఆర్–ఐఐఎమ్ఆర్), న్యూట్రిహబ్‌తో కలిసి సంయుక్తంగా ఆర్‌జిఐ విమానాశ్రయంలో మొట్టమొదటి చిరుధాన్యాల ప్రత్యేకమైన మిల్లెట్ మార్వెల్స్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశాయి. ఈ రెస్టారెంట్‌ను ఐసిఎఆర్–ఐఐఎమ్ఆర్ డైరెక్టర్ సి తారా సత్యవతి, న్యూట్రిహబ్ సిఇఒ డాక్టర్ బి దయాకర్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిఎమ్ఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జిహెచ్ఐఎఎల్) ప్రెసిడెంట్, సిఇఒ ప్రదీప్ పనికర్, మిల్లెట్ మార్వెల్స్, వ్యవస్థాపకుడు, సిఇఒ భరత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రిషికా రెడ్డి హాజరైనారు.

ఎంపిహెచ్ఎ (మహిళా) నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

ఖాళీ పోస్టుల్లో కాంట్రాక్టు ఎంపిహెచ్ఎలను రెగ్యులర్ చేయాలి: టియుఎంహెచ్ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,520 ఎంపిహెచ్ఎ (ఫిమేల్) పోస్టుల భర్తీకి వైద్యారోగ్య సేవల నియామక మండలి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు–సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఫసియుద్దీన్, కె యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీ పోస్టుల్లో ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఎంపిహెచ్ఎ (మహిళా) అభ్యర్థుల ను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నోటిఫికేష న్‌లో కాంట్రాక్టు సర్వీస్‌కు 20 మార్కుల వెయిటేజీ ఇచ్చి, 80 మార్కులకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో కాంట్రాక్టు ఎఎన్ఎంలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలి పారు. 20 ఏళ్లుగా సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయ కుండా నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదని సూచించారు. విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ గతంలో నోటిఫికేషన్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్, రోస్టర్ ప్రకారంగా డిస్టిక్ సెలక్షన్ కమిటీ (జిల్లా ఎంపిక కమిటీ) ఆధ్వర్యంలో నియమితులయ్యారని గుర్తుచేశారు.

నిమ్స్‌లో కొత్త పరిశోధనలకు శ్రీకారం

రాయల్ కాలేజ్ గ్లాస్గో భాగస్వామ్యంతో సేవల్లో మెరుగుదల : డాక్టర్ మైక్ మెకెర్డీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలో సేవల్ని మరింత మెరుగుపరిచేందుకు కొంత పరిశోధనలకు శ్రీకారం చుట్టేందుకు రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో, నిమ్స్ పరస్పర సహకారం అందించుకోనున్నట్టు ఆ కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ మైక్ మెకెర్డీ తెలిపారు. ఇంగ్లాండ్, స్కాట్లాండ్ దేశాల్లో నాణ్యమైన వైద్యాన్ని, పరిశోధనల్ని అందిస్తున్న ఈ సంస్థ అధ్యక్షులు హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిని గురువారం సందర్శించారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప నేతృత్వంలో వివిధ విభాగాల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ మైక్ మాట్లాడారు. ఆస్పత్రిలో పేదలకు అందుతున్న నాణ్యమైన వైద్యసేవలను కొనియాడారు. యాంటీ బయోటిక్స్, ఇతర మందుల వినియోగం, వివిధ రకాల పరిశోధనల గురించి నిమ్స్ వైద్యులతో చర్చించారు.

రెండు సంస్థల మధ్య పరస్పర ఒప్పందం ద్వారా పరిశోధనలు మరింత



వేగవంతం చేయొచ్చని అన్నారు. నిమ్స్ ఎండి, పిజి, ఎంసిఎచ్ విద్యార్థులు ఇంగ్లాండ్ వెళ్లి వైద్య సేవలు, పరిశోధనలపై తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని, అలాగే అక్కడి వైద్య విద్యార్థులు నిమ్స్‌కొచ్చి తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్య వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అవగాహన చిత్రాలను నిమ్స్ డైరెక్టర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ ఒఎస్‌డి డాక్టర్ గంగాధర్, డాక్టర్ పరంజ్యోతి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ తిర్మల్గ్, డాక్టర్ శాంతి వీర్, డాక్టర్ కృష్ణ రెడ్డి, పలు విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలు చేపట్టండి

మంత్రి కెటిఆర్‌కు రేవంత్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో వరద సహాయ చర్యలు చేపట్టాలని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఇంకా లోతట్టు ప్రాంతాల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మంత్రి కెటిఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతయుతమైన పదవిలో ఉండి ప్రజల గోసను పట్టించుకోకుండా పత్తా లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. పుట్టిన రోజులు చేసుకుంటూ ప్రజలను 'మీ చావు మీరు చావండి' అని వదిలేయడమేంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దామంటూ సెల్ఫ్ డబ్బాలు కొట్టుకోవడానికి తండ్రీ, కొడుకులు పోటీ పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్టుగా అన్ని జరిగితే, ఐటీ కారిడార్ నుంచి హయత్‌నగర్ దాకా ట్రాఫిక్ జామ్‌లు ఎందుకవుతున్నాయని నిలదీశారు. పది నిమిషాల ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతున్నదని తెలిపారు. నాలాలు, చెరువులు కబ్జా. హైదరాబాద్ పరిధిలో టిఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు యధేచ్ఛగా భూములు, చెరువులు కబ్జా చేస్తూ... అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన మీరు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వరదల సమయంలో మీడియా ముందుకు వచ్చికేసీఆర్ చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఈ పరిస్థితి కారణం ఎవరనే దానిపై ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకున్నా పాపాన పోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలల ప్రపంచం నుంచి బయటికి వచ్చి ప్రజల కష్టాలను తీర్చే ప్రయత్నం చేయాలని కేటీఆర్‌ను కోరారు. ప్రభావిత ప్రజలకు రూ. పది వేల సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని దినసరి కూలీలను ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదిన మరమత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వరద సాయం అందేలా చూడాలి
జూమ్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి డిమాండ్

రాష్ట్రంలో వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేయాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వరద సాయం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో తన నివాసం నుంచి పార్టీ నేతలతో రేవంత్ జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మణిక్‌రావు ఠాక్రే, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ, పిఇసి సభ్యులు, ఉపాధ్యక్షులు, డిసిసి అధ్యక్షులు సీనియర్ నాయకులతో మాట్లాడారు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలి

ఎన్‌పిడిసిఎల్ ఎండి అన్నమనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) పరిధిలోని 17 జిల్లాల్లో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయటానికి వీలుగా చర్యలు చేపట్టామని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల కరెంటు సరఫరాకు అంతరాయం కలిగినా సాధ్యమైనంత వరకు లోడ్ మానిటరింగ్‌లో సత్వర చర్యలు తీసుకోవడానికి 16 సర్కిళ్ళలోని ఎస్ఈలతో మాట్లాడామని తెలిపారు. 1208 పోళ్ళ, 62 డిటీఆర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. చెట్లు విరిగి లైన్లు తెగిపడిన వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఎట్టిపరిస్థితిల్లో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని సూచించారు. ఇంట్లో విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలనీ, తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు. 1800 425 0028, 1912 కు సంప్రదించాలని సూచించారు.

గంగాడి సుధీర్ మరిన్ని మంచి రచనలు చేయాలి

'కవనం' కవితా సంపుటి ఆవిష్కరణలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కవి, రచయిత రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన గంగాడి సుధీర్ మరిన్ని రచనలు చేయాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. ఆయన రచించిన 'కవనం' కవితా సంపుటిని కెటిఆర్ ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని టీ సాట్ ప్రాంగణంలో ఒయు విసి రవిందర్ యాదవ్, అంబేద్కర్ యూనివర్శిటీ విసి సీతారామారావ్, టీ సాట్ సిఇఒ శైలేష్ రెడ్డి, ఇతర విద్యావేత్తల సమక్షంలో మంత్రి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన మొదటి పుస్తకం 'ఇగురం' కథా సంపుటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆవిష్కరించారంటూ గంగాడి సుధీర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదు

కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అసమర్థ వల్లే నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదని కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గతేడాది కూడా గేట్ల సమస్యతోనే ఇబ్బంది ఏర్పడి సాగు భూములన్నీ కోతకు గురయ్యాయని ఒక ప్రకటనలో గుర్తు చేశారు. గేట్ల పని తీరును పర్యవేక్షించి సరి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ముంచెత్తిన మున్నేరు

ఇండ్లలోకి చేరిన వరదనీరు • పర్యవేక్షించిన మంత్రి, కలెక్టర్, సిపి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాగులు వంకలు నదులు, రిజర్వాయర్లు, బ్యారేజీలు పొంగి ప్రవాహిస్తున్నాయి. ఖమ్మం నగరంలోని మున్నేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మున్నేరు పరివాహకం మొత్తం జలమ యమయింది. మున్నేరు సామర్థ్యం 36 అడుగులు కాగా ఇప్పటికే 30.50 అడుగులు చేరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఖమ్మం నగరంతోపాటు, ఖమ్మం రూరల్ మండలంలోని ఆయా ప్రాంతాల వారిని పునరావస కేంద్రాలకు తరలించారు. ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్‌లో వరదలో చిక్కుకున్న 11 మందిని రిస్క్యూ టీమ్ సభ్యులు సురక్షితంగా తీసుకొచ్చారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపైకి మున్నేరు వాగు వరద నీరు ప్రవహిస్తుండటంతో ఇరువైపుల 2కి.మీ పైగా వాహనాలు నిలిచిపోయాయి. ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్‌లోని హైస్కూల్ లో పునరా వాస కేంద్రం ఏర్పాటు చేయగా.. మధ్యాహ్నం 12 గంటల తర్వాత వరద పొటెత్తడంతో గుర్రాలపాడుకు తరలించారు. కాగా, ఖమ్మం వద్ద మున్నేరు నది ప్రవాహాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్ పర్యవేక్షించారు. లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేశారు. మున్నేరు పరివాహకంలో నడుం లోతు నీటిలో కలెక్టర్, సీపీ తిరిగి వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి ఉధృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం వద్ద గోదావరి మధ్యాహ్నం వరకు 50.5 అడుగులకు చేరిన వరద సాయంత్రం 4 గంటలకు 47.8 అడుగులకు చేరింది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ ప్రియాంక అలా.. వరద ఉధృతిని పర్యవేక్షించారు. పునరాసవాస కేంద్రాల వద్ద వరద బాధితులను సిపిఎం జిల్లా బృందం పరిశీలించింది. చర్ల వద్ద తాలిపేరు ప్రాజెక్ట్ గేట్లు 24 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పాల్వంచలో కిన్నెరసాని 407 అడుగులకు గాను 402 అడుగులకు చేరింది. 12 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆళ్లపల్లిలో రాయిపాడు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది.

మణిపూర్ తరహా కుట్రలకు తెరలేపిన బిజెపి

• తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని చూడడం ద్వారా మణిపూర్ తరహాలో బిజెపి కుట్ర చేస్తున్నదని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని, లేదంటే పోరాటం చేస్తామంటూ బిజెపికి చెందిన ఆదిలాబాద్ బిజెపి పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావు ప్రకటించటాన్ని చూస్తే..గిరిజనుల మధ్య చిచ్చురేపే కుట్రకు పాల్పడుతున్నారని అర్థమవుతున్నదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గిరిజనుల మధ్య మణిపూర్‌లో ఘర్షణలు రగిలించి, మారణహోమం సృష్టించారని తెలిపారు. దేశమంతా బిజెపి పాలిత మణిపూర్ మారణ హోమంపై స్పందిస్తుంటే.. సోయం బాబురావు అక్కడి తరహా కుట్రలకు తెరలేపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో గిరిజన తెగలపై దాడులు, హత్యలు, చేసి మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడులకు పాల్పడుతుంటే బాధ్యతగల ఆ ఎంపి కనీసం స్పందించలేదని గుర్తుచేశారు. మతోన్మాదుల చేతిలో ఆయన కీలుబొమ్మగా సోయం బాబురావు మారాడని విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడకుండా ఆ సమస్యను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని గతంలో ప్రధాని మోడీకి 45 మంది బిజెపి పార్లమెంట్ సభ్యుల సంతకాలతో వినతి పత్రం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు గిరిజన వ్యవహారాల శాఖ మంత్రికి వినతి పత్రం ఇచ్చారని పేర్కొన్నారు. 1976లోనే రాజ్యాంగబద్ధంగా ఎస్‌టి జాబితాలో లంబాడీ గిరిజనులను కలిపారనీ, వారిని ఆ జాబితా నుంచి తొలగించడం సాధ్యం కాదని సోయం బాబురావుకు తెలిసినా బిజెపి నాటకం ఆడుతోందని తెలిపారు. బాబురావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో గిరిజనుల మధ్య ఎలాంటి ఘర్షణలు జరిగినా..అందుకు బిజెపినే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రాణ నష్టం జరగొద్దు

- లోతట్టు ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- పట్టణాల్లో సహాయక చర్యలు చేపడతాం
- శిథిల భవనాల నుంచి జనాలను వెంటనే తరలించాలి
- పురపాలక శాఖ అధికారులు, అదనపు కలెక్టర్లతో మంత్రి కెటిఆర్ టెలికాన్ఫరెన్స్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'ప్రాణ నష్టం జరగకుండా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆయా పట్టణాల్లోని వరదనీరు చేరిన లోతట్టు ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి. శిథిల భవనాల్లోని జనాలను వెంటనే ఖాళీ చేయించాలి' అని సంబంధిత అధికారులను మంత్రి కెటిఆర్ ఆదేశించారు. పట్టణాల్లో వరదలు, వర్షాలపై మంత్రి సమీక్షించారు. పురపాలకశాఖ అధికారులు, అదనపు కలెక్టర్లతో గురువారం ఆయన హైదరాబాద్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం రాజధాని నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. హుస్సేన్ సాగర్ వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలను సిఎం కెసిఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. పురపాలక శాఖ అధికారులతోనూ సిఎం మాట్లాడారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంలోనూ జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న కిందిస్థాయి సిబ్బంది వరకు అందరూ పనిచేస్తున్నారని తెలిపారు. పురపాలక శాఖ ఉద్యోగులకు అన్ని సెలవులను రద్దు చేసినట్టు చెప్పారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్లు, ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నామని చెప్పారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవుతున్నదని తెలిపారు. కానీ ఇప్పటిదాకా ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా చూశామనీ, సాధ్యమైనన్ని ఎక్కువ జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. హైదరాబాద్‌కు రెడ్ అలర్ట్ ఉన్న నేపథ్యంలో



ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నదని చెప్పారు. నాలాల్లో పూడికతీత కార్యక్రమాన్ని ఎప్పుడో పూర్తి చేశామని వెల్లడించారు. చెరువుల బలోపేతం చేసే కార్యక్రమాలు కూడా చేపట్టామనీ, 135 చెరువులకు గేట్లు బిగించామని ప్రకటించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు అధికారులు, సిబ్బంది కూడా నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. గతంలో ఇలాంటి భారీ వర్షాలు పడితే అనేక ప్రాంతాలు జలమయం అయ్యేదని, ఈసారి ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపట్టిన కార్యక్రమాలతో వరద ప్రభావం కొంత తగ్గిందన్నారు. 24 గంటలపాటు భారీ వర్షాలను ఎదుర్కొనేందుకువీలుగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

రాజకీయాలు మాని...ప్రజలకు సాయం చేయండి
ప్రతిపక్షాలకు కెటిఆర్ పిలుపు

భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దని ప్రతిపక్షాలకు మంత్రి కెటిఆర్ సూచించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు వరదలు, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వరద పెరిగే ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు, తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చెరువులకు గండి పడే ప్రమాదం ఉంటే వాటిని కూడా సమీక్షిస్తున్నామని చెప్పారు. మూసీ వరదను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని, అవసరమైతే తాను కూడా శుక్రవారం అక్కడికి వెళ్తానని కెటిఆర్ తెలిపారు.

ప్రజలకు అండగా ఉండండి

భారీ వర్షాలతో ప్రభావితమైన ప్రజలకు అండగా నిలవాలని పార్టీ ప్రజా ప్రతినిధులకు, శ్రేణులకు మంత్రి కెటిఆర్ పిలుపునిచ్చారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొన్ని జిల్లాల్లో వరద ప్రభావం అధికంగా ఉందని, ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు ప్రజలకు తోడుగా నిలవాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వరంగల్ లాంటి జిల్లాల్లో నీట మునిగిన ప్రాంతాలు, గ్రామాల్లో సహాయక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని, స్థానికంగా పార్టీ శ్రేణులు ప్రజలకు అవసరమైన నిత్యవసర సరుకులు అందించడం నుంచి మొదలుకుని తమకు తోచిన ఇతర మార్గాల్లోనూ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే కుమారుడు అనారోగ్యంతో మృతి

నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపి సొంత స్థలంలో అంత్యక్రియలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పుత్రశోకంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి(35) హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో గత కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం ఆయన మతి చెందారు. విష్ణువర్ధన్‌కి భార్య కిరణ్మయితో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రి నుంచి ఎమ్మెల్యే నివాసానికి విష్ణు భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే సొంత స్థలం జింఆర్ కన్వెన్షన్ సెంటర్ పక్కన విష్ణువర్ధన్ రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రాష్ట్ర మంత్రులు మహమ్మద్ అలీ, తన్నీరు హరీశ్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మెన్ సునీతా లక్ష్మారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, మదన్ రెడ్డి, మాణిక్ రావు, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్‌పి రమణ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కుర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.